ప్రలోభాలే అజెండా

- జాడ లేని ప్రజా సమస్యలు
- ప్రభుత్వరంగ సంస్థలను అమ్మేస్తున్నా ప్రశ్నించని వైసిపి
- సీతంరాజు సుధాకర్‌కు పట్టభద్రుల ఓట్లడిగే హక్కుందా?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'వైసిపి తరుపున ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి బరిలోకి దిగిన సీతంరాజు సుధాకర్‌కు అధికార పార్టీ జెండా నీడ తప్ప ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన ప్రజా సమస్యల పట్ల ఎలాంటి అవగాహనా, అజెండా లేదు. పోరాటం చేసిన ఒక్క సందర్భమూ లేదు. ఆయనకు ఓట్లు అడిగే హక్కు ఇంకెక్కడిది' అని పలువురు పట్టభద్రులు బాహాటంగా చెప్పేస్తున్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల్లోనూ దీనిపైనే పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. పోటీలో ఉండాలంటే పార్టీ మద్దతు ఒక్కటేనా ఇతర గుణగణాలేవీ అవసరం లేదా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. వ్యాపారాలు చేసుకుంటూ వాటి పురోభివృద్ధికి పార్టీ జెండా నీడన ముందుకెళ్లిపోవాలనుకునే నేతల్లో ఆయన ఒకరని చెప్పుకుంటున్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రంలోని బిజెపి సర్కారు ప్రైవేటీకరణ చేస్తున్నా నోరుమెదపని వైనం సదరు అధికార అభ్యర్థి సొంతం.

వేల సంఖ్యలో కార్మికులు, కార్మిక కుటుంబాలే కాకుండా ప్లాంట్‌పై ఆధారపడి జీవించే వేల కుటుంబాలు, వ్యాపారాలు విశాఖపట్నం ప్రత్యేకత. ఇలాంటి ప్రత్యేక పరిస్థితి చేజారిపోతున్నా పట్టని అధికార వైసిపిలో ఉన్న సదరు అభ్యర్థి స్టీల్‌ప్లాంట్ కార్మికుల ఓట్లు అడిగే హక్కును కోల్పోయారనే చెప్పాలి. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను తెగనమ్మాలని మోడీ సర్కారు కుట్రలపై కుట్రలు సాగిస్తున్నా ఉత్తరాంధ్ర పట్టభద్రుల తరపున మండలిలో ప్రశ్నిస్తానని ప్రకటించిన దాఖలాలు లేదు.

సమస్యలపై ఏనాడూ గళమెత్తని సీతంరాజు

విశాఖకు అత్యంత కీలకమైన రైల్వేజోన్‌పైనా కినుక వహించడం, వాల్తేరు రైల్వే డివిజన్‌ను ఎత్తేసినా, ఉత్తరాంధ్ర ప్రాంత ఆర్థిక పరిపుష్టిని దెబ్బ తీసే చర్యలపైనా ఏనాడూ అధికార పార్టీ ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా బరిలోకి దిగిన ప్రస్తుత అభ్యర్థి గళమెత్తలేదు. వెనుకబడిన జిల్లాలుగా రాష్ట్రంలోనే కాకుండా దేశంలోనే ముద్రపడ్డ శ్రీకాకుళం, విజయనగరం గ్రామీణ ప్రాంతాలకు ఎంతో కొంత ఆసరాగా నిలిచే విశాఖలోని ప్రభుత్వ రంగ సంస్థలు, విశాఖ నగరంపై ఆధారపడి జీవించే వేల కుటుంబాల జీవనాన్ని దెబ్బతీసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చర్యలున్నాయి.



ఈ తరహా ప్రజా సమస్యల అజెండాపై పిడిఎఫ్ అభ్యర్థి అయిన డాక్టర్ కోరెడ్ల రమాప్రభ మినహా ప్రస్తుతం బరిలో నిలిచిన తెలుగుదేశం, వైసిపి, బిజెపి నేతలు పోరాడడం కాదు కదా కనీసం ఏ కోసానా స్పందించలేదంటే ఆశ్చర్యం కలుగక మానదు. ఉత్తరాంధ్రకు రూ.వేల కోట్లు ఆర్థిక ప్యాకేజీ కేంద్రంలోని బిజెపి ఇస్తానని ఇవ్వకుండా మోసం చేసినా రాష్ట్రంలో 2019లో పగ్గాలు చేపట్టిన వైసిపి ఏనాడూ ప్రశ్నించలేదు. ఆ పార్టీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు ఇవేమీ పట్టడమే లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు సకాలంలో జీతాలు చెల్లించకపోవడం, ప్రశ్నిస్తే వేధింపులకు గురిచేయడం వంటి సమస్యలు కొనసాగుతూనే ఉన్నాయి. ఏ ముఖం పెట్టుకుని వారిని అధికార వైసిపి ఓట్లడగడానికి వెళ్తోంది అంటూ పట్టభద్రులే ప్రశ్నిస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి.

ప్రలోభాలు...పంపకాలే అజెండా

చేతిలో అధికారం ఉండడంతో ఉద్యోగులు, అధికారులపై బెదిరింపులకు పాల్పడడం, ఎయు వైస్ ఛాన్సలర్ హోటల్‌లో ప్రైవేట్ కాలేజీ యాజమాన్యాలు, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి ప్రజా సంఘాలకు దొరికిపోవడం తెలిసిందే. ప్రభుత్వ వైన్ షాపుల్లోని సూపర్ వైజర్లు సైతం అధికార పార్టీకి అనుకూలంగా ఓటు ఓయాలంటూ శుక్రవారం సాయంత్రం విశాఖ ఉత్తర నియోజకవర్గంలో అధికార పార్టీ నేత కెకె.రాజు ఆధ్వర్యాన సమావేశం నిర్వహించిన వీడియో బయటపడింది. ఉత్తరాంధ్ర ప్రాంతమంతటా తెలంగాణ రాష్ట్ర స్టిక్కర్లుండే కార్లను వినియోగించి వెండి వస్తువులను బహుమతులుగా శుక్రవారం సాయంత్రం సీతంరాజు సుధాకర్ తన ఇంటి నుంచి పంపిస్తున్న వీడియో, ఫొటోలు కూడా బయటపడ్డాయి. ఇవన్నీ అధికారిక అక్రమాలే. వీటన్నింటిపైనా జిల్లా కలెక్టర్ ఎన్నికల అధికారిగా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

13న పోలింగ్‌లో బుద్ధి చెప్పడం ఖాయం

అధికార వైసిపి కేవలం తన శక్తియుక్తులన్నీ ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, డబ్బు, ఇతర బహుమతులను పంపిణీ చేసే అంశాలపైనే దృష్టిసారించింది. చెప్పడానికి అజెండా లేదు. దొడ్డిదారులు, దొంగ పనులపైనే ఆ పార్టీ కార్యాచరణ ఉన్నట్టు కనిపిస్తోంది. వాటిని పట్టభద్రులు చైతన్యంతో తిప్పికొట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఎక్కడికక్కడే వారి ఎత్తులను చిత్తు చేస్తున్నారు. పోలింగ్ రోజైన ఈ నెల 13న ఇదే ప్రతిబింబించనున్నదని పలువురు చెప్తున్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులపై...

ప్రభుత్వం కక్షసాధింపు

- సిపిఎస్‌ను రద్దు చేయాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశ్వరరావు
- ఉద్యోగుల సమస్యలపై వామపక్షాల ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఉద్యోగులు, ఉపాధ్యాయులపై రాష్ట్ర ప్రభుత్వం కక్షసాధింపు ధోరణితో వ్యవహరిస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, కె.లోకనాథం విమర్శించారు. ఉద్యోగ, ఉపాధ్యాయులపై ప్రభుత్వ వేధింపులు మానుకోవాలని, సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, సకాలంలో జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన నగరంలోని అంబేద్కర్ జంక్షన్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019 ఎన్నికలకు ముందు అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోపు సిపిఎస్ విధానాన్ని రద్దు చేస్తానని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హామీనిచ్చారని గుర్తు చేశారు. ఇచ్చిన హామీని అమలు చేయకపోగా ఏడాది కాలంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీతాలు సకాలంలో చెల్లించకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. డిఎలు చెల్లించడం లేదని, డిఎ బకాయిల ఊసెత్తడం లేదన్నారు. చివరకు ఉద్యోగుల ఖాతాల్లో నిల్వ ఉన్న సొమ్ము నుంచి పెట్టుకునే లోన్లు కూడా సుమారు రూ.మూడు వేల కోట్లు రెండేళ్లుగా చెల్లించకుండా ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎస్ రద్దు కోసం పోరాడుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయులపై తీవ్ర నిర్బంధాన్ని, అణచివేతను ఉపయోగిస్తూ అరెస్టులు, షోకాజ్ నోటీసులతో నిరంతరం బెదిరింపులకు పాల్పడడం దుర్మార్గమన్నారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాల్గొన్నారని షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నారని చెప్పారు. ఎస్‌సిఆర్‌టి డైరెక్టర్ ప్రతాప్ రెడ్డి, కడప ఆర్‌జెడి సహా కొందరు ఉన్నతాధికారులు ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడుతుంటే కట్టడి చేయలేని ప్రభుత్వం, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఉపాధ్యాయులు పాల్గొనకూడదని ఆదేశించడం గర్హనీయమన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో చర్చలకు పిలిచి సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం, భయపెట్టి నిర్బంధాన్ని ప్రయోగించడం సరికాదన్నారు. పాఠశాలల పర్యవేక్షణ పేరుతో విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులను మానసికంగా వేధింపులకు గురిచేస్తుంటే, విద్యార్థులకు నాణ్యమైన విద్య ఎలా సాధ్యమో ప్రభుత్వమే సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కక్షసాధింపు ధోరణిని విడనాడి సిపిఎస్ రద్దుతో సహా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలన్నింటిని తక్షణం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సకాలంలో జీతాలు చెల్లించాలని, సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు చేస్తున్న ఆందోళనకు మద్దతు ప్రకటిస్తున్నామని తెలిపారు. ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి, జి.సింహాచలం, జిల్లా కమిటీ సభ్యులు కె.నాగమణి, టి.తిరుపతిరావు, పి.తేజేశ్వరరావు సిపిఐ నాయకులు వెంకటరమణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మందస మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు, నాయకులు ఆర్.దిలీప్‌కుమార్, డి.భాస్కరరావు, పి.అప్పలస్వామి, ఎస్.వల్లభ తదితరులు పాల్గొన్నారు. వజ్రపుకొత్తూరు బస్టాండ్ ఆవరణలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.ఆనందరావు, ఎన్.మోహనరావు, డి.భానుమతి తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న సిపిఎం, సిపిఐ నాయకులు

ప్రచారానికి నేటితో తెర

- సాయంత్రం 4 గంటలకు బ్రేక్
- నేటి నుంచి 13 వరకు మద్యం దుకాణాలు మూత
- పోలింగ్ రోజున సెలవుపై అస్పష్టత
- సెలవు పెట్టి వెళ్లాలంటూ ప్రయివేట్ సంస్థలు ఓటర్లకు సలహా

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

పట్టభద్రులు, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల సమరానికి శనివారం సాయంత్రం తెర పడనుంది. ప్రచారానికి ఒక్కరోజే మిగిలి ఉండడంతో శుక్రవారం ప్రచారం పతాక స్థాయికి చేరుకుంది. ఎమ్మెల్సీ స్థానాలకు పోటీ పడుతున్న అభ్యర్థులు నేరుగా ఓటర్లను కలుసుకోవడంతో పాటు సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం చేశారు. అభ్యర్థుల తరుపున వారి మద్దతుదారులు ఓటర్ల స్లిప్పులను పంచుతూ తమ అభ్యర్థికి మొదటి ప్రాధాన్య ఓటును వేసి గెలిపించాలని అభ్యర్థించారు. మరోవైపు ఈనెల 13వ తేదీన పోలింగ్‌కు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎన్నికల నిబంధనల మేరకు పోలింగ్‌కు 48 గంటల ముందు ప్రచారం ముగించాల్సి ఉంటుంది. దీంతో శనివారం సాయంత్రం నాలుగు గంటలకు ప్రచారానికి బ్రేక్ పడనుంది. మరోవైపు ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తోంది. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలకు వెబ్‌కాస్ట్ నిర్వహణ, పోలింగ్ సామగ్రి పంపిణీ, ఎన్నికల అనంతరం బూత్‌ల నుంచి స్ట్రాంగ్ రూమ్‌ల వరకు భద్రత, స్ట్రాంగ్ రూమ్‌ల్లో సిసి కెమెరాల ఏర్పాటుకు సంబంధించి అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది.

పట్టభద్రులకు 37 మంది... స్థానికానికి ఇద్దరు

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 37 మంది బరిలో ఉన్నారు. పిడిఎఫ్ (ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్) తరుపున డాక్టర్ కోరెడ్ల రమాప్రభ, వైసిపి అభ్యర్థిగా సీతంరాజు సుధాకర్, టిడిపి నుంచి వేపాడ చిరంజీవిరావు, బిజెపి అభ్యర్థిగా పి.వి.ఎన్ మాధవ్‌తో పాటు మరో 33 మంది పోటీ చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇద్దరు అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వైసిపి అభ్యర్థిగా నర్తు రామారావు, స్వతంత్ర అభ్యర్థిగా ఆనెపు రామకృష్ణ బరిలో నిలిచారు.

నేటి నుంచి 13 వరకు డ్రై డే

ఉత్తరాంధ్ర పట్టభద్రుల, స్థానిక సంస్థల శాసనమండలి ఎన్నికల నేపథ్యంలో ఈనెల 11వ తేదీ సాయంత్రం నాలుగు గంటల నుంచి 13వ తేదీ పోలింగ్ ముగిసే వరకు డ్రై డేగా ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13న ఎమ్మెల్సీ పోలింగ్ నేపథ్యంలో శాంతిభద్రతల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 135సి, ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ చట్టం 1968లోని సెక్షన్ 20(1)లో అధికారాల మేరకు జిల్లాలోని అన్ని మద్యం దుకాణాలు మూసివేయాలని ఆదేశించారు. జిల్లాలోని 156 ఎపిఎస్‌బిసిఎల్‌తో పాటు 21 బార్లు, రెండు ఆర్మీ క్యాంటీన్లు, ఎచ్చెర్లలోని ఐఎంఎఫ్ఎల్ డిపోలను మూసివేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 16న ఎన్నికల లెక్కింపు రోజున కూడా మూసివేయాలని స్పష్టం చేశారు.

సెలవుపై అస్పష్టత

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం ఇప్పటికే సెలవు ప్రకటించింది. అయితే సెలవు విషయంలో కొంత అస్పష్టత నెలకొంది. ఓటు హక్కు ఉన్న వారికే సెలవు ఇస్తామని, ఓటరు స్లిప్ సమర్పించాలని కొన్ని ప్రభుత్వ శాఖలు ఆయా ఉద్యోగులకు చెప్తున్నాయి. వ్యాపార, వాణిజ్య సంస్థలు, ప్రయివేట్ ఆస్పత్రులు మాత్రం సెలవు మంజూరు చేయడానికి ససేమిరా అంటున్నట్లు ఉద్యోగులు చెప్తున్నారు. ఓటు వేయాలనుకుంటే సెలవు పెట్టుకుని వెళ్లాలని సలహా ఇస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో సెలవు విషయంలో కొంత గందరగోళం నెలకొంది.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తదితరులు

14న డీవార్మింగ్ డే

- నులిపురుగుల నివారణతోనే సంపూర్ణ ఆరోగ్యం
- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

రాష్ట్రీయ బాల స్వాస్థ్య కింద ఈనెల 14న నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం (నేషనల్ డీవార్మింగ్ డే)ను విజయవంతం చేయాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ పిలుపునిచ్చారు. డీవార్మింగ్ డేపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వైద్యారోగ్య, విద్య, సాంఘిక సంక్షేమం, మున్సిపల్, మహిళాశిశు సంక్షేమం తదితర శాఖల అధికారులతో జిల్లా సమన్వయ కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులిపురుగుల నివారణతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమన్నారు. జిల్లాలో 1 నుంచి 19 ఏళ్ల లోపు బాలబాలికలకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేసేందుకు అవసరమైన చర్యలను చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చిన్నారుల్లో అనారోగ్య సమస్యలకు కారణమవుతున్న నులిపురుగులను నివారించి ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా నులిపురుగుల నివారణ (అల్బెండాజోల్) మాత్రను తప్పక వేయించాలన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలలకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. పాఠశాలలో తీసుకున్న చర్యలను జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ కలెక్టర్‌కు వివరించారు. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి మాట్లాడుతూ జిల్లాలో 4,40,908 మంది పిల్లలకు నులిపురుగుల నివారణ కోసం అల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేసేందుకు లక్ష్యంగా నిర్ధేశించినట్లు తెలిపారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో డాక్టర్ శ్రీదేవి, మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ కె.అనంతలక్ష్మి, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఆర్.గడ్డెమ్మ, సమగ్ర శిక్ష ఎపిసి జయప్రకాష్, వైద్య విధాన పరిషత్ జిల్లా కో-ఆర్డినేటర్ శ్రీదేవి, మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, ఆర్ఐఒ ఎఒ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కోరెడ్ల రమాప్రభను గెలిపించండి

యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ కోరెడ్ల రమాప్రభను ఉద్యోగ, ఉపాధ్యాయ, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, పెన్షనర్లు, కార్మికులు, పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ఎస్.ఎస్ ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ పరిష్కారం కాలేదన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు దాచుకున్న పిఎఫ్, ఎపిజిఎల్ఐ బకాయిలు 18 నెలలుగా చెల్లింపులు చేయడం లేదని చెప్పారు. కొంత మొత్తంలో ప్రతి నెలా చెల్లించాలని కోరినా చెల్లించకపోగా, ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికలు కావడంతో ఈనెల 31వ తేదీ లోపు రూ.మూడు వేల కోట్లు చెల్లిస్తామని చెప్పడం హాస్యాస్పదమన్నారు. గత సంవత్సరం సైతం ఇలానే డబ్బులు చెల్లిస్తామని ఇవ్వలేదని గుర్తుచేశారు. ఒక్క డిఎ కూడా ఇవ్వని ప్రభుత్వం, ఇప్పుడు ఒకే నెలలో రూ.మూడు వేల కోట్లు ఎలా చెల్లిస్తుందని ప్రశ్నించారు. సరెండర్ లీవుల బకాయిలు మాట ప్రస్తావించడం లేదన్నారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తానన్న హామీ అటకెక్కిందని విమర్శించారు. టైమ్ స్కేల్ అమలు చేస్తామని కెజిబివి టీచర్లకు ఇచ్చిన ఉత్తర్వులు నేటికీ అమలు కాలేదన్నారు. ఎస్ఎస్ఎ, ఎంఆర్‌సి పనిచేస్తున్న ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, క్లస్టర్ రిసోర్స్‌పర్సన్లకు ఉద్యోగ భద్రత కల్పించి మినిమం టైం స్కేల్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. సిపిఎస్‌ను రద్దు చేసి జిపిఎస్ అమలు చేస్తానని మాట మార్చడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇంజినీరింగ్, పిజిలు చేసిన సచివాలయ ఉద్యోగులకు ఆఫీస్ సబార్డినేట్, రికార్డు అసిస్టెంట్ జీతం ఇస్తున్నారని, ఇది అన్యాయమన్నారు. నిరంతరం, ఉద్యోగులు ఉపాధ్యాయుల సమస్యలపై శాసనమండలిలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీలే రాబోయే కాలంలో అవసరమని స్పష్టం చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలు బలపరిచిన రమాప్రభను గెలిపించాలని కోరారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.అప్పారావు, ఎస్.కిషోర్ కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ వై.ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్

ఉపాధ్యాయులపై వేధింపులు ఆపాలి

విద్యాశాఖ కార్యాలయం వద్ద యుటిఎఫ్ ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉపాధ్యాయులను ఒత్తిళ్లకు గురిచేయడం, షోకాజ్ నోటీసులు ఇవ్వడం, సస్పెన్షన్ వంటి చర్యలకు విద్యాశాఖ అధికారులు పాల్పడుతున్నారని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్రవిమర్శించారు. ఉపాధ్యాయులపై వేధింపులను ఆపాలని విద్యాశాఖ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులను దోషులుగా చూస్తూ పాఠశాల ప్రిన్సిపల్ సెక్రటరీ నుంచి కిందిస్థాయి అధికారుల వరకు వేధింపులకు గురిచేయడం తగదన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.అప్పారావు, ఎస్.కిషోర్ కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు పని దొంగలని, బోధన చేయరని, ఉద్యమాల్లో పాల్గొంటారని, పేపర్లు దిద్దడం లేదని సత్యదూర వ్యాఖ్యలు చేస్తున్నారని చెప్పారు. విద్యార్థుల ముందు ఉపాధ్యాయులను మందలిస్తున్నారని తెలిపారు. ఉన్నతాధికారి విజిట్ తదుపరి దిగువ స్థాయి అధికారులు పాఠశాలపై దాడి చేస్తూ ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్ 30వ తేదీ నాటికి 220 రోజులు పని దినాలు ఉండాలని నిర్ధారించారని, గతేడాది ఆగస్టు 26 వరకు బ్రిడ్జి కోర్సులు, రెమిడియల్ కోచింగ్ నిర్వహించాలని, సాధారణ బోధన వద్దని ఉత్తర్వులు ఇచ్చారని గుర్తు చేశారు. విద్యాశాఖలో ఉన్నతాధికారుల తప్పులను ఉపాధ్యాయుల పైకి నెట్టడం సరికాదన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కె.రమేష్ కుమార్, జి.సురేష్, టి.వి.జి భాస్కరరావు, రాష్ట్ర కౌన్సిలర్లు జి.గిరిధర్, వై.ఉమాశంకర్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ బి.రవికుమార్, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

నోటీసు
మహారాజశ్రీ గౌరవనీయులైన శ్రీకాకుళం అదనపు సీనియర్ సివిల్ జడ్జి
O.S.420/2018

Between:
ముగునురు కాంత ...వాది
And
సంపతిరావు అప్పారావు వగైరా ...ప్రతివాది
To.
సంపతిరావు అప్పారావు, S/o.లేటు సుబ్బరాజు, రామకృష్ణ నగర్ కాలనీ, APSRTC Comple వెనుక, శ్రీకాకుళం జిల్లా.

పై నెంబరు దావలో వాది ప్రతివాదిపై దావ వేసియున్నారు. ఇందులో మీకు నోటిసు నిమిత్తం **తేది. 15-03-2023** వాయిదా అయియున్నది. కావున **ఉదయం 10.30 గంIIలకు** శ్రీకోర్టు వారి యెదుట హాజరు కావలెను. లేని యెడల మీ పరోక్షమున విచారించి తీర్మానంచడం అగునని యింది మూలముగా తెలియచేయుచున్నాము.

మెట్ట సత్యనారాయణ
వాది తరుపున అడ్వకేటు,
శ్రీకాకుళం,
సెల్: 7989270123

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM.
O.S No.18/2019.

Between:
Girada Venkata ramana. --Plaintiff
And:
Girada Padmavathi & others --Defendants
D-8 Girada Ratnamala, D/o Satyanarayana, W/o Dr. Tadela Ramanarayana rao, Hindu, aged58 years, resident of D.No. 12-23-25, kaki street, srikakulam town & district.

Please take notice that the above **O.S18/2019** was posted to **17/03/2023** for your appearance in the above said court. you are all informed to appear on the said date at **10:30 AM** in person or through advocate and if you fail to appear the Aforesaid matter will be decided Exparte on merits.

S. RAJESWARA RAO
Advocate, Srikakulam
Ph.No.9440529354

IN THE HONOURABLE COURT OF THE M.A.C.T. CUM PRINCIPAL DISTRICT JUDGE AT SRIKAKULAM.
M.V.O.P. 202/2022

Between:
Pilla Surya Rao --Petitioners
And
Payala Lakshmana Rao @ Lamana Rao and 2 others --Respondents
To,
R1.Payala Lakshmana Rao @ Lamana Rao son of late Papayya, aged 38 years, Hindu, driver of the lorry bearing registration AP 35V1689, Yadava by caste, R/at door 5-1, Narasapuram-Agraharam village, Ponduru mandalam. Srikakulam district..
Please take this notice that the above petition is posted to **06-04 2023** for your appearance (R1).Your are hereby directed to appear before the above court at **10-30 AM on 6-04-2023** in person or through Advocate without fail. Otherwise the matter will be decided in your absence.

YENNI SURYA RAO, Advocate
SRIKAKULAM.
cell:9440609834

IN THE HONOURABLE COURT OF THE ADDITIONALSENIOR CIVIL JUDGE AT SRIKAKULAM.
O.S. NO. 62/2017

Between:**Simma Krishna veni** -Plaintiff
And: **Gondu Ramana murthy & Others** -Proposed Parties..
To **D-8 Moyya Bharathi** W/o Ramana murthy aged 51 years, House hold duties. R/o D.No. 2-10, Mamidivalasa village. Narasannapeta mandal, Srikakulam District
D-9 Moyya Manmadha rao s/o Rama rao aged 41 years, employee -Rest do-
D-10 Moyya Seshagiri rao S/o Rama rao aged 39 years, cultivation,- Rest do-
D-11Surapu Prabavathi W/o Laxmana rao aged 42 years, -Rest do-
D-12 Potnuru Leela w/O Venkata rao aged 57 years, Hindu D.no. 55-5-44, Umanagar, H.B.Colony, Besides Shesadri apartments, Near Milatary Hotel, Isakathota, Visakhapatnam, spiller.
D-13 Baratam Somasekhara Venkata ramana Gupta S/o Late Papa rao aged 54 years, Employee, D.NO. 20A, Singupuram village, Srikakulam Mandal and District,
Please take notice that the above **O.S62/2017** was posted to **13/03/2023** for your appearance in the above said court. you are all informed to appear on the said date at **10:30 AM** in person or through advocate and if you fail to appear the Aforesaid matter will be decided Exparte on merits.

S. RAJESWARA RAO
Advocate, Srikakulam
Ph.No.9440529354

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM.
I.A.No. 149/2022 In O.S.No.65/2021

Between: **Pydi Nagabhusan Rao &another** - Plaintiffs/Petitioners.
And: **Seepana Surapunaidu &another** -Defendants/Respondents.
To,
R-1.Gudla Panduranga swami, S/o late Satyanarayana, aged about 81 years, Hindu, Occ: Rtd. Employee, R/o. Door No. 11-3-87, Pedda Baratam veedhi, Srikakulam town & corporation, Srikakulam district. (Deceased)
R-2.Gudla Devi, D/o late Gudla Panduranga swami, aged about 36 years, Hindu, Household duties, R/o. Door No. 11-3-87, Pedda Baratam veedhi, Srikakulam town & corporation, Srikakulam district.
R-3. Gudla Rani, D/o late Gudla Panduranga swami, aged about 34 years, Hindu, Household duties, R/o. Door No. 11-3-87, Pedda Baratam veedhi, Srikakulam town & corporation, Srikakulam district.
Please take notice that the above **I.A149/2022** was posted to **29/03/2023** for your appearance in the above said court. you are all informed to appear on the said date at **10:30 AM** in person or through advocate and if you fail to appear the Aforesaid matter will be decided Exparte on merits.

G. KRISHNA PRASAD
Advocate,
Srikakulam
Ph.No.7893450188

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM.
I.A No.148/2022 in I.A.No.220/2021 in O.S No.65/2021

Between: **Pydi Nagabhusan Rao &another** - Plaintiffs
And: **Seepana Surapunaidu &another** -Defendants.
To,
D-1.Gudla Panduranga swami, S/o late Satyanarayana, aged about 81 years, Hindu, Occ: Rtd. Employee, R/o. Door No. 11-3-87, Pedda Baratam veedhi, Srikakulam town & corporation, Srikakulam district. (Deceased)
D-2.Gudla Devi, D/o late Gudla Panduranga swami, aged about 36 years, Hindu, Household duties, R/o. Door No. 11-3-87, Pedda Baratam veedhi, Srikakulam town & corporation, Srikakulam district.
D-3. Gudla Rani, D/o late Gudla Panduranga swami, aged about 34 years, Hindu, Household duties, R/o. Door No. 11-3-87, Pedda Baratam veedhi, Srikakulam town & corporation, Srikakulam district.
Please take notice that the above **O.S65/2021** was posted to **29/03/2023** for your appearance in the above said court. you are all informed to appear on the said date at **10:30 AM** in person or through advocate and if you fail to appear the Aforesaid matter will be decided Exparte on merits.

G. KRISHNA PRASAD
Advocate,
Srikakulam
Ph.No.7893450188

బాల్య వివాహం అడ్డగింత

పొందూరు: మండలంలోని తానెం గ్రామంలో ఈనెల 11న జరగనున్న బాల్యవివాహాన్ని అధికారులు శుక్రవారం అడ్డుకున్నారు. సంబంధిత అధికారులు తెలిపిన వివరాల మేరకు బాల్య వివాహంపై సమాచారం రావడంతో మండలంలోని లోలుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లి బాలిక వివరాలను సేకరించారు. పదో తరగతి చదువుతున్న బాలిక మూడు రోజులుగా పాఠశాలకు రాలేదని ఉపాధ్యాయులు తెలపడంతో బాలిక స్వగ్రామం తానెం వెళ్లి కుటుంబ సభ్యులను కలిసి కౌన్సెలింగ్ ఇచ్చారు. బాలిక తండ్రి లేకపోవడంతో పాటు కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో వివాహం చేసేందుకు కుటుంబసభ్యులు నిశ్చయించారని, 18 సంవత్సరాలు నిండిన తర్వాత పెళ్లి చేస్తామని అధికారులకు బాలిక తల్లి లిఖితపూర్వకంగా రాసి ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. సిడిపిఒ పాపినాయుడు, సూపర్ వైజర్ శరణ్య, ఐసిపిఎస్ జనార్ధన్, చైల్డ్ హెల్ప్‌లైన్ దుర్గ, జాహ్నవి, విఆర్ఒ సాయి, సెక్రటరీ నీలాద్రి తదితరులు ఉన్నారు.

ఈ టీచర్ మాకొద్దు

బూర్జ: తమ పాఠశాలలోని సోషల్ టీచర్ సరిగ్గా పాఠాలు చెప్పడం లేదని, అడిగితే కొడుతున్నారని.. ఈ టీచర్ మాకొద్దు అని పాలవలస జెడ్‌పి హైస్కూల్ 7వ తరగతి విద్యార్థులు చైల్డ్‌లైన్‌కు ఫిర్యాదు చేశారు. విద్యార్థుల ఫిర్యాదు మేరకు మానవ అక్రమ రవాణా విభాగం ఎస్ఐ ఎ.కేశవరావు పాఠశాలను శుక్రవారం సందర్శించి, విచారణ చేపట్టారు. సోషల్ టీచర్ సంబంధించిన సబ్జెక్టు చెప్పకుండా అన్యమత ప్రచారం చేస్తున్నారని, పరీక్షలో ఫెయిల్ చేస్తానని కొడుతున్నారని విద్యార్థులు విచారణలో చెప్పారని ఆయన అన్నారు. దర్యాప్తు వివరాలను జిల్లా ఎస్‌పికి నివేదిస్తానని అన్నారు. ఆయనతో పాటు హెచ్‌సి ఉన్నారు.

ఎన్నికల కోడ్‌తో పనులెలా ప్రారంభిస్తారు?

పొందూరు: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండగా గ్రామంలో వెల్నెస్ భవన నిర్మాణం పనులను ఏవిధంగా ప్రారంభిస్తారని అధికారులను మొదలవలస ఎంపిటిసి మొదలవలస సీతారామారావు ప్రశ్నించారు. గురువారం అధికారులు నిర్మాణం ప్రారంభించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేస్తారు. అధికారులే

పనులను ప్రారంభిస్తున్న అధికారులు

ఎన్నికల కోడ్ ఉల్లంఘించడంపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామన్నారు. నిర్మాణం చేపడుతున్న ప్రాంతం రెల్లిగెడ్డ వరద ముంపుకు గురవుతుందని, అటువంటి ప్రాంతంలో నిర్మాణం ఎలా చేపడుతున్నారని ప్రశ్నించారు. దీనిపై ఎంపిడిఒ హరిహరరావును వివరణ కోరగా ఇప్పటికే ఈ నిర్మాణం ప్రారంభమైందని, ఆన్‌లైన్‌లో ప్రారంభమైనట్లు చూపుతోందని ఇది ఎన్నికల కోడ్‌కు విరుద్ధం కాదని చెప్పారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఇచ్ఛాపురం: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఎక్సైజ్ ఎస్ఐ గురుమూర్తి విద్యార్థులకు సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాలతో యువత నిర్వీర్యంపై సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రోబిన్ కుమార్ పాడి అధ్యక్షత వహించిన సభలో గురుమూర్తి మాట్లాడారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు గురించి వివరించారు. మత్తు పదార్థాలు సేవించి ఎంతో మంది ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకున్నారని అన్నారు. యువత వీటికి దూరంగా ఉండాలన్నారు. అవగాహన కార్యక్రమంలో అధ్యాపక బృందం రామకృష్ణ, గణపతి, దుర్యోధన, సంతోష్‌కుమార్, దేవరాజు, తదితరులు పాల్గొన్నారు.

భూమి రక్షణకు మల్చింగ్

ఆమదాలవలస: మండలంలోని చేపేనపేటలో ప్రకృతి వ్యవసాయ మండల యాంకర్ నక్క చిరంజీవి ఆధ్వర్యంలో విత్తన గుళికలుగా చేసుకున్న విత్తనాలను పంట పొలాల్లో వేసుకున్న తర్వాత మల్చింగ్ చేశారు. ఈ విధంగా పంట వ్యర్థాలతో మల్చింగ్ చేయడం వల్ల నేలను సారవంతంగా మార్చుకోవచ్చని, భూమిపై పొర ఖాళీగా ఉంచకుండా ఈ విధంగా పలు రకాల విత్తనాలు వేసుకొని మల్చింగ్ చేయడం వల్ల భూమిలోని జీవన ద్రవ్యం పెంపొంది, నేల పంట పెరుగుదలకు అవసరమైన పోషకాల బాంఢాగారంగా తయారవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రకతి వ్యవసాయ సిబ్బంది సురేష్, మల్లేష్, కృష్ణవేణి, లక్ష్మి, జానకిరామ్, రైతులు పాల్గొన్నారు.

జీతాలు అందేలా చూస్తా

ప్రజాశక్తి - కవిటి

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దృష్టికి ఉద్దానం మంచినీటి పథకం ఉద్యోగుల సమస్యలు తీసుకెళ్లి, తొందరలోనే జీతాలు అందేలా కృషి చేస్తానని వైసిపి ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త సాయిరాజ్ అన్నారు. ఐదు రోజులుగా ఉద్దానం మంచినీటి పథకం సిబ్బంది సమ్మెలో ఉన్న విషయం తెలుసుకున్న ఆయన శుక్రవారం ఉద్దానం మంచినీటి సరఫరా ఉద్యోగుల సమ్మె వద్దకు చేరుకున్నారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. ఉద్యోగులకు ఎన్నో సమస్యలు ఉన్నా వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగునీటి సరఫరా చేయాలని సూచించారు. తొందర్లోనే సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి పూడి నేతాజీ, ఎంపిటిసి పూడి నీలాచలం, తదితరులు పాల్గొన్నారు.

జనసేన సంఘీభావం

ఉద్దానం మంచినీటి పథకం కార్మికులకు జనసేన పార్టీ ఇచ్ఛాపురం నియోజకవర్గ నాయకులు దాసరి రాజు, లోళ్ల రాజేష్ సంఘీభావం తెలిపారు. సమ్మెలో ఉన్న కార్మికులను కలిసి, వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 27 నెలలుగా జీతాలు లేకుండా కుటుంబాలు

కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న దాసరి రాజు

నడవడం అనేది అత్యంత దారుణమైన పరిస్థితి అని, వారి కుటుంబసభ్యుల మనోవేదనను దృష్టిలో ఉంచుకుని తక్షణమే వారికి జీతాలు మంజూరు చేయాలని కోరారు. ఉద్యోగుల సమ్మెతో ఇప్పటికే పలు గ్రామాల్లో తాగునీటి సమస్యలు ప్రారంభమయ్యాయని, తక్షణమే సమస్య పరిష్కరించి గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజల తరపున జనసేన పోరాడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్.భాస్కర్, అంగ సురేష్, కుర్మారావు, బడగల రామకృష్ణ, డే రాజు, శ్యామ్, ధనుంజయం, పండి పద్వీ, కాళీ తదితరులు పాల్గొన్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి రామకృష్ణ

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

శాసనమండలిలో స్థానిక సంస్థల ప్రతినిధులు, ప్రజల పక్షాన ప్రశ్నించేందుకు ఒక్క అవకాశం ఇవ్వాలని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి ఆనెపు రామకృష్ణ కోరారు. పట్టణంలోని ఒక హోటల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తోందని, చివరకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పంచాయతీల నిధులనూ దారిమళ్లించిందని విమర్శించారు. తాను ఎన్నికల బరిలో లేకుంటే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్నట్లు స్థానిక ప్రజాప్రతినిధులకు తెలిసి ఉండేది కాదన్నారు. స్థానిక సంస్థల ఉనికిని కాపాడేందుకు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల గౌరవాన్ని నిలబెట్టేందుకే తప్పనిసరి పరిస్థితుల్లో అందరి మద్దతుతో

మాట్లాడుతున్న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి రామకృష్ణ

స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు చెప్పారు. శాసనమండలిలో జిల్లా సమస్యలతో పాటు స్థానిక సంస్థల నిధులు, విధులు, హక్కుల కోసం ప్రశ్నించే గొంతుకకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీలకతీతంగా తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో తూర్పుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.శ్యామసుందరరావు, కరిమజ్జి మల్లేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, ఎస్.శ్రీనివాసులు, పోతురాజు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకంపై ఆకస్మిక తనిఖీ

ఆకస్మిక తనిఖీలు చేస్తున్న కమిషనర్ రమేష్

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం పురపాలక సంఘం పరిధిలో మెయిన్ రోడ్డు, డైలీ మార్కెట్ పరిసరాల్లో ఉన్న కిరాణా దుకాణాలు, స్వీట్ దుకాణాలు, చాట్, ఫాస్ట్‌ఫుడ్, హోల్‌సేల్ దుకాణాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై ఆకస్మిక తనిఖీ చేశారు. సింగిల్ యుజ్ ప్లాస్టిక్ అమ్ముతున్న దుకాణ యజమానులకు జరిమానా విధించారు. రూ.900లు జరిమానా విధించి, 650 గ్రాముల సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను సీజ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ రమేష్ మాట్లాడుతూ దుకాణ యజమానులకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను భారత ప్రభుత్వం నవంబర్ 1, 2022 నుంచి నిషేధం విధించిందని, అందరూ విధిగా నిషేధం అమలు చేయాలని పిలుపునిచ్చారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు బదులు చెక్కతో తయారు చేసిన స్పూన్‌లను, గుడ్డ సంచులను, బయో డిగ్రేడ్ వస్తువులను ఉపయోగించాలని సూచించారు. ఈ తనిఖీలో శానిటరీ బాధ్యులు ఉపేంద్రకుమార్, సచివాలయ శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ కార్యదర్శులు, శానిటరీ మేస్త్రీలు పాల్గొన్నారు.

ప్రగతి లక్ష్యాలను పూర్తి చేయాలి

ఆమదాలవలస: 2022-23 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన ప్రగతి లక్ష్యాలను పూర్తి చేయాలని మెప్మా పీడీ ఎం.కిరణ్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో వార్డు సచివాలయ వెల్ఫేర్, ఎమినిటీస్ కార్యదర్శులు, మెప్మా సిబ్బంది, ఆర్‌పిలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీ లేఅవుట్ల పురోగతి, జగనన్న తోడు రికవరీ, టిడ్కో రుణాల మంజూరు, పురోగతి తదితర అంశాలపై సమీక్షించారు. సిబ్బంది సేవల నవీకరణ జరగాలంటే నిర్దేశించిన ప్రగతి లక్ష్యాలను సాధించాలని తెలిపారు. వివిధ పథకాల్లో లబ్ధిదారులకు నిరంతర అవగాహన కల్పించి ప్రభుత్వ సేవలు పొందేలా చైతన్యం కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో

మాట్లాడుతున్న పీడీ కిరణ్‌కుమార్

హౌసింగ్ ఎఇ డి.సన్యాసిరావు, బ్యాంకుల సమన్వయకర్త కె.సత్యనారాయణ, మెప్మా జిల్లా సంస్థాగత బలోపేత నిపుణులు ఎస్.వెంకటరావు, జీవనోపాధుల నిపుణులు డి.కృష్ణారావు, సామాజిక భద్రతా నిపుణులు పి.విజయకుమారి, స్థానిక మెప్మా సిబ్బంది, ఆర్‌పిలు, వార్డు సచివాలయ వెల్ఫేర్, ఎమినిటీస్ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైల్వే అండర్ పాసేజ్‌పై డిఆర్‌ఎంకు వినతి

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద కొలిగాం, మునుభద్ర, తదితర గ్రామాల చెందిన ప్రయాణికుల ఇబ్బందులు, విద్యార్థుల అవస్థలపై ఇచ్ఛాపురం ఎలియన్స్ క్లబ్ సభ్యులు రైల్వే డిఆర్‌ఎం రింకేష్ రాయ్ దృష్టికి తెచ్చారు. శుక్రవారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. సాధ్యమైనంత తొందరగా సమస్యను పరిష్కరిస్తామనిరైల్వే డిఆర్‌ఎం హామీ ఇచ్చారు. అక్కడ రైల్వే సొంత నిధులతో ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తామని, అండర్ పాసేజ్ వినియోగంలోకి తెస్తామని అన్నారు. ఈ విషయమై రైల్వే డివిజనల్ ఇంజినీరు రవి కుమార్ యాదవ్‌ను కలవాలని సూచించారు. కార్యక్రమంలో ఎలియన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు జి.ఉమాశంకర్, కోశాధికారి సత్యమయ్య, ఉప కోశాధికారి పసుపురెడ్డి ఢిల్లీ, డైరెక్టర్ జాడు ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

ప్రజాశక్తి - సోంపేట

మండలంలోని శారదాపురం, మాకన్నపురం ప్రభుత్వ పాఠశాలలను జెడ్‌పిటిసి టి.యశోద శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. విద్యాబోధన, మధ్యాహ్న భోజన పథకం అమలు వంటి అంశాలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాలను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో పలాసపురం

మధ్యాహ్న భోజన నిర్వాహకులతో మాట్లాడుతున్న యశోద

సర్పంచ్ తడక జోగారావు, స్థానికులు సతీష్, సురేష్ పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

ప్రజాశక్తి - కవిటి

మనం చేసే రక్త దానం మరొకరికి ప్రాణదానం చేస్తుందని వక్తలు అన్నారు. సోంపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జానకికి బి-పాజిటివ్ రక్తం అత్యవసరమైంది. విషయం తెలుసుకున్న కవిటి డయాలసిస్ యూనిట్‌లో పనిచేస్తున్న రాజ్‌కుమార్ వెంటనే ఆస్పత్రికి చేరుకుని రక్తదానం చేశాడు. దీంతో జానకికి ప్రాణాపాయం తప్పింది. మంచిమనసుతో వచ్చి రక్త దానం చేసిన రాజ్ కుమార్‌ను కుటుంబ

సభ్యులతో పాటు స్థానికులు అభినందించారు. కార్యక్రమంలో హెల్పింగ్ హేండ్స్ సభ్యుడు కాళీ సాహు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఆదిత్యున్ని దర్శించుకున్న శ్రీకాంత్

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని రాష్ట్ర దేవదాయ ధర్మదాయశాఖ సలహాదారులు జ్వాలాపురపు శ్రీకాంత్ శుక్రవారం సందర్శించారు. ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయనకు శేష వస్త్రాన్ని కప్పి

జ్ఞాపికను అందజేస్తున్న ఇప్పిలి హరి సూర్యప్రకాశ్

జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఇ.ఒ హరిసూర్యప్రకాష్, ఆలయ మాజీ పాలకమండలి సభ్యులు యవిజలు గాయత్రి, విజయనగరం బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు రాజారావు, మనోహర్ పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంకు వితరణ

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని బెహరా మానసిక కేంద్రానికి యూనియన్ బ్యాంకు శ్రీకాకుళం యూనిట్ ఫ్యాన్లు, పది ఎల్ఇడి లైట్లు, పది డ్రమ్ములు, గ్రైండర్‌ను వితరణగా శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంకు రీజనల్ హెడ్ గురునాథరావు మాట్లాడుతూ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా వీటిని అందజేశామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజనల్ హెడ్ దుర్గాప్రసాద్, చీఫ్ మేనేజర్లు మాధురి, మహేష్, అనిల్, గుప్తా, సింహాచలం, కృష్ణ, పవన్, కె.శ్యామలకుమారి, శేఖర్, బి.విజయభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో 150 కుటుంబాలు చేరిక

శ్రీకాకుళం అర్బన్ : గార మండలం కొర్లాం సదిగాం పంచాయతీకి చెందిన సుమారు 150 కుటుంబాలు వైసిపిని వీడి మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి సమక్షంలో టిడిపిలో చేరాయి. వారికి గుండ లక్ష్మీదేవి, అప్పలసూర్యనారాయణ పార్టీ కండువా వేసి, ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎన్ని సూరిబాబు, ఎ.వి.సన్యాసి, బి.సన్యాసి, ఎ.రామకృష్ణ, వరద రాజు, ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన

సోంపేట: స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి వద్ద శుక్రవారం మండల స్థాయి ఆశా వర్కర్లు, వైద్య సిబ్బందికి మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో అదనపు జూనియర్ సివిల్ జడ్జి రామమణి పాటు ఆస్పత్రి డైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్జి రామ మాట్లాడుతూ మహిళలకు సంబంధించి అమల్లో ఉన్న చట్టాలపై అవగాహన కల్పించారు. గృహ హింస, వివాహ రిజిస్ట్రేషన్, లైంగిక వేధింపులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

'నర్తు'ను గెలిపించాలి

నందిగాం: స్థానిక సంస్థల వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నర్తు రామారావు గెలుపునకు జెడ్‌పిటిసి, ఎంపిటిసిలు సహకరించాలని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ కోరారు. శుక్రవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఎంపిటిసి, జెడ్‌పిటిసిలతో సమావేశమయ్యారు. తిలక్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావును అధ్యధిక మెజార్టీతో గెలిపించాలని తిలక్ కోరారు. అందుకు ఎంపిటిసి, జెడ్‌పిటిసీలు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో నందిగాం ఎంపిపి ఎన్.శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు కె.బాలకృష్ణారావు, సర్పంచ భైరాగి, మడపాల సంజీవరావు, ఎంపిటిసిలు, తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

మెళియాపుట్టి: మండలంలోని గోపీనాథపురం గ్రామానికి చెందిన నగరంపల్లి కామరాజు ఐటిడిఎ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంజిఆర్ మిత్ర బృందం సభ్యులు, ఎంపిటిసి పైరిది నంబాల వెంకటరావు శుక్రవారం మృతుని భార్య సావిత్రమ్మకు రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. వారి కష్ట సుఖాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పైల కూర్మారావు, రామస్వామి, జమ్మన భైరాగి, ఎంజిఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

హమాలీల సమస్యలు పరిష్కరించాలి

శ్రీకాకుళం అర్బన్: పొట్టి శ్రీరాములు మార్కెట్‌లో హమాలీల సమస్యలను శ్రీకాకుళం కార్పొరేషన్ కమిషనర్ ఓబులేసు పరిష్కరించాలని సర్పంచ్ సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్ కోరారు. పొట్టి శ్రీరాములు మార్కెట్ ఖుద్దూస్ వర్కర్ అసోసియేషన్, శ్రీకాకుళం పట్టణ హమాలీ వర్కర్స్ యూనియన్, టిఎన్‌టియుసి సంయుక్తంగా కూలి రేట్లలో మార్పుల పై చర్చలు జరపడం జరిపిందు సంపన్నమన్నారు. మార్కెట్‌లోని శ్రీరామ మందిరంలో శుక్రవారం హమాలీలతో ఆయన మాట్లాడారు. మారిన కూలి రేట్లు ఈనెల 15 నుంచి అమలు చేసేందుకు ఒప్పందం కుదిరిందన్నారు. సమావేశంలో టిఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి దొండ నరేష్, అధ్యక్షులు నక్క వేణు, అధ్యక్షులు సింధు దాలినాయుడు, కార్యనిర్వాహక అధ్యక్షులు అప్పారావు, హమాలీలు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అమరావతి జెఎసి పిలుపుమేరకు శ్రీకాకుళం నగరంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు నల్ల బ్యాడీలు ధరించి రెండో రోజు నిరసన తెలిపారు. రెవెన్యూ సర్వీసుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.వెంకటరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బివివిఎన్ రాజు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులపై ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని తప్పు పట్టారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన ఆర్థిక ప్రయోజనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్

నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న సిబ్బంది

చేశారు. దశల వారీ ఆందోళనలో భాగంగా విధులకు హాజరవుతూ భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాకుళం డివిజన్ కార్యదర్శి డి.ప్రకాశరావు, గణాంకాల శాఖా సంఘం జిల్లా అధ్యక్షులు బి.సుధాకర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

జి.సిగడాం: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులను మరోమారు మోసం చేసిందనిడిటి ఎన్.నిరల్మ అన్నారు. శుక్రవారం రెవెన్యూ కార్యాలయ సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం కొనసాగుతుందని అన్నారు. ఏప్రిల్ 5 వరకు నల్ల బ్యాడ్జీలతో నిరసన కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ రామచంద్ర, విఆర్ఒలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి దూడకూ టీకా

ప్రజాశక్తి - జలుమూరు

నాలుగు నెలలు దాటిన ప్రతి దూడకూ గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేయాలని పశుసంవర్ధక శాఖ ఎడి డాక్టర్ మంద లోకనాథం అన్నారు. శుక్రవారం అచ్యుతాపురం పశువైద్య కేంద్రం పరిధి కొండపోలవలసలో జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా టీకాలను వేశారు. అందులో భాగంగా గ్రామంలో 130 టీకాలు వేసినట్లు పశు వైద్యాధికారి పట్ట సంతోష్‌కుమార్ తెలిపారు. మండలంలో 11,450 పశువులకు టీకాలు వేయటం లక్ష్యం కాగా, ఇప్పటివరకు రెండు వేల పశువులకు టీకాలు వేసినట్లు ఎడి చెప్పారు. ఈ నెలాఖరులోగా లక్ష్యాలను పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో వీరితోపాటు పశు వైద్య సిబ్బంది, పాడి రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బూర్జ: మండలంలోని తోటవాడ గ్రామంలో శుక్రవారం సచివాలయ కన్వీనర్ల మండల అధ్యక్షులు గుమ్మడి రాంబాబు, సర్పంచ్ సూర ఆనందరావు ఆధ్వర్యంలో ఆవులు, గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ టీకాలు ఈనెల ఒకటో తేదీ నుండి 31వ తేదీ వరకు మండలంలోని పశువులకు వేస్తామని కొల్లవలస పశు వైద్యాధికారి డాక్టర్ గోపాశిన వెంకటరావు పాడి రైతులకు తెలిపారు. పాడి రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా ముందస్తుగా ఈ టీకాలు వేయించాలని సూచించారు ఇప్పటివరకు మండలంలో 1650 పశువులకు టీకాలు వేశామని, అందరి పాడిరైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలియచేశారు. కార్యక్రమంలో పశు సంవర్ధక సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాలలో చేపల మార్కెట్ వద్దు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నగరంలోని ప్రభుత్వ పురుషుల, మహిళల పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో చేపల మార్కెట్ ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కళాశాల సిబ్బంది, విద్యార్థులు, స్థానికులు నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ ప్రేమ ప్రసన్నవాణిని కోరారు. కళాశాల ప్రాంగణాన్ని పరిశీలించేందుకు శుక్రవారం వచ్చిన ఆమెను విద్యార్థులు, స్థానికులు కలిశారు. నిత్యం వేలాది మంది విద్యార్థులు కళాశాలలో చదువుకునేందుకు వస్తున్నారని, దీనికితోడు చుట్టూ నివాస ప్రాంతం కావడం వల్ల జనావాసాల నడుమ చేపల మార్కెట్‌ను ఏర్పాటు చేయొద్దని కోరారు. దీనిపై కమిషనర్‌ను కలిసి మాట్లాడాలని ఆమె సూచించారు. సహాయ కమిషనర్‌ను కలిసిన వారిలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జానకిరాం, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ దామోదరరావు, స్థానికులు జి.మీనకేశ్వరరావు, పి.శ్రీనివాసరావు, పి.నారాయణరావు తదితరులున్నారు.

జోర్డాన్‌లో సిక్కోలు వాసి మృతి

వజ్రపుకొత్తూరు: జోర్డాన్ దేశంలో సిక్కోలు వాసి గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబసభ్యుల కథనం ప్రకారం... మండలంలోని పెద్దవంక గ్రామానికి చెందిన వలస కూలీ బత్తిని రాజు(47) జోర్డాన్‌లో ఇఫ్కో కంపెనీలో సీనియరు టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. బుధవారం

రాజు(ఫైల్)

ఆయనకు గుండెపోటు రావడంతో మృతి చెందాడు. అక్కడ సహచరులు గురువారం కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. దీంతో కుటుంబసభ్యులు శోకసంద్రంలో మునిగారు. మృతదేహం స్వగ్రామానికి వచ్చేలా ప్రభుత్వం కృషి చేయాలని మృతుని భార్య రోహిణి కోరింది. మృతునికి తల్లి పార్వతి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

వాహనం ఢీకొని..

వజ్రపుకొత్తూరు: బొలేరో ఢీకొనడంతో స్కూటీపై వెళ్తున్న యువకుడు గురువారం రాత్రి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రం రామనాథపురానికి చెందిన భగవాన్ దాస్(30) కొంత కాలంగా గోవిందపురం పంచాయతీ గూనాలపాడులో చిన్న బడ్డీ నిర్వహిస్తూ జీవిస్తున్నాడు. రాత్రి పూండి బస్టాండ్ నుంచి పచారి సరుకులు

భగవాన్ దాస్ (ఫైల్)

కొనుక్కొని తన స్కూటీపై ఇంటికి వెళ్తుండగా నౌపడ నుంచి కొబ్బరి బొండాం లోడుతో వస్తున్న బొలెరో ఢీకొంది. ఈ ప్రమాదంలో భగవాన్ దాస్ తలకు బలంగా గాయమైంది. స్థానికులు ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం 108 వాహనం ద్వారా యువకుడిని పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతునికి భార్య మోనిదాస్, కుమార్తె రోహిణి దాస్, కుమారుడు లక్కీదాస్ ఉన్నారు. కుటుంబానికి జీవనాధారమైన వ్యక్తి చనిపోవడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. ఎస్ఐ మధుసూదనరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి దుర్మరణం

వజ్రపుకొత్తూరు: మండలంలోని పూండి రైల్వే స్టేషన్ పరిధిలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుని వయస్సు 60ఏళ్ల పైబడి ఉంటుందని ఎస్ఐ ఎస్కె.షరీఫ్ తెలిపారు. గురువారం రాత్రి రైలు ప్రమాదంలో మృతి చెంది ఉండొచ్చని చెప్పారు. రైల్వే సిబ్బంది సమాచారం మేరకు మృతదేహాన్ని పలాస ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించినట్లు చెప్పారు. మృతుని కుటుంబసభ్యులు ఎవరైనా ఉంటే ఫోన్ నెంబరు 9440627567ను సంప్రదించాలని కోరారు.

మహిళా విద్యా ప్రదాత సావిత్రిబాయి పూలే

వజ్రపుకొత్తూరు: మహిళా విద్యా ప్రదాత సావిత్రిబాయి పూలే అని అక్కుపల్లి ఎంజెపి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.పాపారావు అన్నారు. శుక్రవారం అక్కుపల్లి ఎంజెపి గురుకుల

నివాళ్లర్పిస్తున్న ఉపాధ్యాయులు

పాఠశాల ఆవరణలో సావిత్రిబాయి పూలే వర్ధంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మొదటి మహిళా ఉపాధ్యాయురాలు అని, అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన ధీర వనిత అని అన్నారు. బాలిక విద్యను ఉద్యమంలా చేపట్టారని అన్నారు. వారి ఆశయాల మేరకు బాలిక విద్యకు ప్రోత్సాహం అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కుమారి, ఉపాధ్యాయులు ఉష, ప్రశాంతి, శ్రీలక్ష్మి, పద్మ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు తక్షణ చికిత్స

ప్రజాశక్తి - పలాస

రహదారి ప్రమాదాలకు గురైన బాధితులకు తక్షణమే చికిత్స అందించాలని ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త డాక్టర్ పి.ప్రకాష్‌రావు అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆదేశాల మేరకు శుక్రవారం పలాస మున్సిపల్ సమావేశ మందిరంలో వైద్య అధికారులు సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదం బాధితులు ఎవరైనా సరే వారికి చికిత్స అందించాలని అన్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వారినైనా సరే ప్రభుత్వం వారికి ఉచితంగా వైద్యం అందించేందుకు ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ఐఆర్ ఎడి ఇంటిగ్రేటెడ్ రోడ్ యాక్సిడెంట్ డేటాబేస్ అప్‌పై వైద్యాధికారులకు సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ అనురాధ, ఎన్ఐసి.మేనేజర్ రవికిరణ్, వైద్యాధికారులు, ప్రైవేట్ వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాడివలస ఉన్నత పాఠశాలకు ఫర్నిచర్ వితరణ

ప్రజాశక్తి - పొందూరు

తాడివలస గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐలు తమ్మినైన అప్పలనాయుడు, వరప్రసాద్ స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సుమారు రూ.75వేల విలువైన ఫర్నీచర్‌ను వితరణగా అందజేశారు. గ్రామంలోని ఖరీదైన తమ స్వగృహాన్ని ప్రభుత్వ అవసరాలకు ఉచితంగా ఇవ్వాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఆ ఇంటిలోని విలువైన ఫర్నీచర్ పాఠశాలకు అందజేశారు. బీరువాలు, టేకుతో తయారు చేసిన టేబుల్స్, కుర్చీలు, ఫ్యాన్‌లు, ఉడ్‌తో తయారు చేసిన స్టాండ్స్, తదితర వస్తువులను శనివారం ప్రధానోపాధ్యాయులు లఖినాన హేమనాచార్యులకు బంధువులైన

ఫర్నిచర్‌ను పరిశీలిస్తున్న హెచ్‌ఎం హేమనాచార్యులు

తమ్మినైన వెంకటేశ్వర్లు, తమ్మినైన సన్యాసప్పారావుల ద్వారా అందజేశారు. అనునిత్యం పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములవుతున్న అప్పలనాయుడు, వరప్రసాద్ సోదరులకు సర్పంచ్ తమ్మినైన మణెమ్మ, ఉపాధ్యాయులు, గ్రామస్తులు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - ఆమదాలవలస

సైబర్ మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆర్థిక అక్షరాస్యత సిఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్ అన్నారు. శుక్రవారం సరుబుజ్జిలి మండలం బొప్పడాంలో యూనియన్ బ్యాంక్ సౌజన్యంతో ఎస్ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ నిర్వహణలో కళాజాతాలో భాగంగా ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. పలానా బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామంటూ ఎవరైనా ఫోన్లుచేసి బ్యాంకు అకౌంటు వివరాలు అడిగితే సమాచారాన్ని ఎట్టి పరిస్థితులలోనూ ఇవ్వవద్దని సూచించారు. ఎటిఎంలో నగదు విత్‌డ్రా చేయమని కార్డును ఇవ్వకూడదని తెలిపారు. పిఎం సురక్ష బీమా యోజన, పిఎం జీవన జ్యోతి బీమా యోజన, తదితర పథకాలపై వివరించారు. డిజిటల్ పేమెంట్స్ వల్ల కలిగే లాభాలను ప్రజలకు

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందం

వివరించారు. సైబర్ మోసాలకు గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు, ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్ మెన్ 14448 టోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ పి.వెంకన్న, కళాజాతా కళాకారులు కె.శంకరరావు, కె.కృష్ణారావు, ఎం.లక్ష్మి, సిఎఫ్ఎల్ సిబ్బంది రామారావు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.